# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 VIKARABAD




ఆదిబట్ల సమీపంలోని టీసీఎస్ ఎదుట అనుమతుల్లేకుండా నిర్మించిన షాపులు

## అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

- ఆదిబట్ల మున్సిపాలిటీలో యథేచ్ఛగా వెలుస్తున్న రేకుల షెడ్లు
- కొరవడిన అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

ఆదిబట్ల, ఫిబ్రవరి 13 : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని ముఖ్య కూడళ్లు, ప్రధాన రోడ్లపై అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. కొందరు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండానే రేకుల పై కప్పులతో ఏకంగా షాపులనే నిర్మించి.. వాటిని వ్యాపార, వాణిజ్య సంస్థలకు అద్దెకు ఇస్తూ రూ. లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ కొరవడడంతో మున్సిపాలిటీ ప్రతి ఏటా రూ. లక్షల్లో రాబడిని కోల్పోతున్నది. ఆదిబట్ల మున్సిపాలిటీ కొన్నేండ్లుగా అభివృద్ధిలో దూసుకుపోతున్నది. పట్టణం నాలువైపులా విస్తరించి ఎన్నో కొత్త కాలనీలు ఏర్పాటవుతున్నాయి. తొమ్మిది విలీన గ్రామాలతోపాటు మున్సిపాలిటీలోని ప్రతి గ్రామానికీ రవాణా సౌకర్యం పెరిగింది. దీంతో కొన్ని ముఖ్యకూడళ్లతోపాటు ప్రధాన రోడ్ల వెంట కొందరు భవన యజమానులు స్థానిక మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండానే యథేచ్ఛగా రేకులపై కప్పులతోపాటు షెట్టర్లు బిగించి వందలాది షాపులను నిర్మిస్తున్నారు. మంగళ్‌పల్లి చౌరస్తాతోపాటు బొంగులూరు నాగార్జునసాగర్ హైవేపైనా.. అలాగే, ఆదిబట్ల సమీపంలోని టీసీఎస్ సమీపంలోనూ అనుమతుల్లేకుండానే వందలాదిగా రేకుల షెడ్లతో ఏర్పాటైన షెట్టర్లు దర్శనమిస్తున్నా యి. వాటిని వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలకు నెలకు రూ.ఐదు వేల నుంచి రూ. పది వేల వరకు అద్దెకిస్తూ ప్రతి ఏటా రూ. లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

అలాగే, మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాల్లోని ప్రధాన రోడ్లపైనా షాపులు ఏర్పాటవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను కట్ట డి చేయాల్సిన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించిన దాఖలాల్లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో మున్సిపాలిటీ భారీగా ఆదాయాన్ని కోల్పోతున్నది. వాస్తవానికి మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు (రెసిడెన్షియల్), దుకాణాలు(కమర్షియల్) నిర్మించే ముందు స్థల యజమాని అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించి మున్సిపల్ అధికారుల నుంచి అనుమతి పొందాలి. ఆ తర్వాతే నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయ్యాక డోర్ నంబర్‌తోపాటు అసెస్‌మెంట్ చేయించుకుని ఏటా ఆస్తి పన్ను చెల్లించాలి.



మంగళ్‌పల్లి గేటు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న రేకుల షాపు

### తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం..

మున్సిపాలిటీలోని అక్రమ షెడ్ల నిర్మాణంపై తనిఖీలు నిర్వహిస్తాం. ఎక్కడెక్కడ రేకుల పై కప్పులతో షాపులు నిర్మించారో.. అలాగే మున్సిపాలిటీ పరిధిలో రేకుల షెడ్లు ఎన్ని ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలిస్తాం. ఆస్తి పన్ను చెల్లించాలని బాధ్యులకు నోటీసులు జారీ చేస్తాం. అప్పటికీ స్పందించకపోతే చర్యలు తీసుకుంటాం.



**- బాలకృష్ణ, ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్**

### బీఆర్ఎస్ అధినేతను కలిసిన నాయకులు

మాజీ సీఎం కేసీఆర్‌ను గురువారం రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, వికారాబాద్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జిల్లాలోని తాజా రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ అధినేత సూచించినట్లు వారు చెప్పారు.

**-వికారాబాద్, ఫిబ్రవరి 13**



# భూగర్భజలం.. అధఃపాతాళం

## ముంచుకొస్తున్న వేసవి కాలం.. మరింత దిగజారుతున్న నీటిమట్టం


- రెండు నెలల ముందే మొదలైన ఎండల ప్రభావం
- ఉమ్మడి రంగారెడ్డిలో గణనీయంగా పడిపోయిన జలాలు



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): భూగర్భజలాలు అంతకంతకూ దిగజారిపోతూ నగరవాసులకు కలవరం పుట్టిస్తున్నాయి. మరింత పాతాళానికి చేరుకుంటూ ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని అపార్టుమెంట్లు, నివాసగృహాల్లో బోర్లలో నీటి మట్టం మరింత కిందికి పడిపోతున్నది. ఫలితంగా ప్రైవేటు ట్యాంకర్లకు విపరీతంగా గిరాకీ పెరిగిపోయింది. జలమండలి వివిధ నీటి వనరుల మంచినీటి సరఫరాను యథావిధిగా కొనసాగిస్తున్నప్పటికీ అప్పుడే నగరంలోని పలు ప్రాంతాల్లో ఆ తాలూకు ఛాయలు కనిపిస్తున్నాయి.

### రెండు నెలల ముందే..

వేసవి రాగానే సాధారణంగా మార్చి-ఏప్రిల్‌లో కనిపించే ప్రభావం ఈ సారి ఫిబ్రవరిలోనే మొదలైంది. రెండు నెలల ముందే ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ఆ మేరకు భూగర్భజల నీటిమట్టం కూడా క్రమంగా పడిపోతున్నది. 2024 డిసెంబర్-2025 జనవరి మధ్యే సరాసరిన నాలుగైదు అడుగుల మేర భూగర్భజలాలు కిందకు పడిపోయాయి. గతేడాది హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనా వర్షపు నీరు ఇంకే పరిమాణం కూడా రోజురోజుకూ తగ్గుతుండటం, ఉష్ణోగ్రతలు జనవరి నుంచే మొదలు కావడంతో నీటి వినియోగం కూడా భారీగా పెరుగుతున్నది. దీంతో భూగర్భజలాలను ఎక్కడికక్కడ తోడు తుండటంతో నీటి మట్టం లోతునకు పడిపోతున్నది. భూగర్భజల వనరుల శాఖ నివేదిక ప్రకారం.. డిసెంబర్-జనవరి మధ్యే హైదరాబాద్‌లో 0.33 మీటర్లు, మేడ్చల్-మల్కాజిగిరిలో 0.86 మీటర్లు, రంగారెడ్డిలో 1.08 మీటర్లు, వికారాబాద్‌లో 1.64 మీటర్ల లోతునకు జలాలు పడిపోయాయి.



### పదేండ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే..

హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో గత పది సంవత్సరాల్లో జనవరి నెలలో ఇదే అత్యధిక తగ్గుదల అని భూగర్భజల వనరుల శాఖ నివేదిక చెబుతున్నది. దీంతోపాటు ప్రధానంగా రంగారెడ్డి జిల్లాలోకి వచ్చే పశ్చిమ భాగంలోని ఐటీ కారిడార్‌తోపాటు దానికి అనుసంధానంగా ఉండే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. దీంతో ఆ ప్రభావం జలమండలి, ప్రైవేట్ నీటి ట్యాంకర్లపై పడింది. బంజారాహిల్స్ ప్రాంతంలో జలమండలి సాధారణం కంటే రెట్టింపు స్థాయిలో నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సి వస్తున్నది. ఐటీ కారిడార్‌లోనూ ఈ ప్రభావం నెమ్మదిగా మొదలైంది. రెండు రోజుల కిందట ఈ సీజన్‌లోనే అత్యధికంగా 35.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం ముమ్ముందు పరిస్థితి ఎలా ఉంటుందనే దానిపై ఆం దోళన కలిగిస్తున్నది. అత్యంత ఆం దోళనకరంగా మేడ్చల్ జిల్లా రాష్ట్రంలోనే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అత్యధిక లోతున భూగర్భజలాల లభ్య త ఉన్నట్లుగా భూగర్భజల వనరుల శాఖ నివేదికలో వెల్లడైంది. గతేడాది జనవరి తో పోలిస్తే హైదరాబాద్ మినహా మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో భూగర్భజల నీటిమట్టం లోతుగా ఉన్నట్లు వెల్లడైంది. మునుపటికంటే మేడ్చల్‌లో 1.82 మీటర్లు, రంగారెడ్డిలో 0.29 మీటర్లు, వికారాబాద్‌లో 0.31 మీటర్ల లోపలికి జలాలు ఉన్నాయి. కాగా ఈ ఏడాది జనవరిలో రాష్ట్రంలోనే అత్యంత లోతున భూగర్భజలాలు ఉన్న జిల్లాగా వికారాబాద్ (12.29 మీటర్ల లోతు) మొదటి స్థానంలో ఉంటే ఆతర్వాత మేడ్చల్ జిల్లా (11.21 మీటర్ల లోతున) రెండో స్థానంలో ఉంది. ఇది ఒకవిధంగా ఆందోళన కలిగించే పరిణామం. రానురాను ఎండలు పెరుగుతుండటం, భూమిలోకి నీరు ఇంకే పరిస్థితి లేనందున ముమ్ముందు జలాలు మరింత లోతునకు పడిపోయే ప్రమాదముంది.

**4 జిల్లాల పరిధిలో భూగర్భ జల నీటిమట్టం తీరు ఇలా ఉంది.. (మీటర్ల లోతులో)**

| జిల్లా | జనవరి-2024 | మే-2024 | డిసెంబరు-2024 | జనవరి-2025 |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | 8.19 | 9.42 | 6.96 | 7.29 |
| మేడ్చల్-మల్కాజిగిరి | 9.38 | 13.94 | 10.35 | 11.21 |
| రంగారెడ్డి | 9.84 | 14.06 | 9.08 | 10.13 |
| వికారాబాద్ | 11.98 | 16.46 | 10.65 | 12.29 |



## కల్వర్టును మట్టితో కప్పేశారు.!

రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా ఉండేందుకు నిర్మించిన కల్వర్టులు కొందరి భూదాహంతో రాబోయే రోజుల్లో కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఎగువ ప్రాంతం నుంచి పల్లపు ప్రాంతానికి, కుంటలు, చెరువుల్లోకి వర్షపు నీరు వెళ్లేందుకు వీలుగా ఉండేలా రోడ్లపై అధికారులు రూ. లక్షలు వెచ్చించి కల్వర్టులను నిర్మించారు. కానీ కొందరు వ్యాపారులు తాము కొనుగోలు చేసిన భూముల్లో కల్వర్టులను మట్టితో కప్పి వేస్తూ ప్రకృతి, ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారు. మండలంలోని సంగెం గ్రామం మీదుగా వేముల్‌నర్వ వెళ్లే దారిలో నిర్మించిన కల్వర్టును కొందరు వ్యాపారులు మట్టితో కప్పివేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్వర్టు మట్టితో కప్పి ఉంటే దిగువ ప్రాంతానికి వర్షపు నీరు ప్రవహించదని, ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి మరీ .

**-కేశంపేట, ఫిబ్రవరి 13**

## ఎమ్మెల్యేలపై పెరుగుతున్న ధిక్కార స్వరాలు

# సారూ..హామీల అమలెప్పుడు..?

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచి 14 నెలలు పూర్తైనా సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఆయా సెగ్మెంట్లలోని వివిధ వర్గాల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని షాద్‌నగర్, చేవెళ్ల, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో హామీలను అమలు చేయాలంటూ ప్రజలు ఎక్కడికక్కడే నిలదీస్తున్నారు. హామీలను అమలు చేస్తారనే నమ్మకంతోనే ఓట్లు వేశామని.. తీరా గెలిచిన తర్వాత ముఖం చాటేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**-రంగారెడ్డి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ)**

- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో సర్వత్రా ఆగ్రహం
- మాటకు కట్టుబడి ఉంటారనే నమ్మకంతోనే ఓట్లేశామని వెల్లడి
- ప్రజాప్రతిధులకు వ్యతిరేకంగా ధర్నాలు.. ఆందోళనలు

### ఇబ్రహీంపట్నం సెగ్మెంట్‌లో ఫార్మాసిటీ..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఫార్మాసిటీ అనుబంధ గ్రామాలైన మేడిపల్లి, కుర్మిద్ద, నానక్‌నగర్, తాటిపర్తి గ్రామాల్లో రైతుల పట్టా భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించి వారి భూములు వారికే తిరిగి ఇప్పిస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు హామీలిచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లోని బాధిత రైతులంతా తమ ఓట్లను కాంగ్రెస్ అభ్యర్థికే వేశారు. అయితే ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించలేదని.. తమకు రైతుభరోసాతోపాటు పొలాలపై బ్యాంకులు రుణాలూ ఇవ్వడంలేదని.. తమ భూములను అమ్ముకోవాలన్నా రిజిస్ట్రేషన్లు కావడంలేదని ఆ నాలుగు గ్రామాల రైతులు ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేసుకుని దాని ఆధ్వర్యంలో ఆందోళన బాట పట్టారు. ఇటీవల ఆ రైతులు తమ భూములను ప్రభుత్వం తీసుకోవద్దంటూ కోర్టును ఆశ్రయించగా.. రైతుల నుంచి బలవంతంగా భూములను తీసుకోవద్దని ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. కాగా, ఫార్మాసిటీ ఏర్పాటుకు భూములు ఇచ్చేందుకు అభ్యంతరమేమిటో తెలిపేందుకు కలెక్టరేట్‌కు రావాల్సింది ఇటీవల కలెక్టర్ నారాయణరెడ్డి బాధిత రైతులకు నోటీసులు ఇచ్చారు. వాటిని అందుకున్న వందలాది మంది అన్నదాతలు కలెక్టరేట్‌కు తరలి రాగా.. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో వారు అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ భూములను ఫార్మాసిటీ ఏర్పాటు కోసం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.



ఇటీవల మేడిపల్లి, కుర్మిద్ద, నానక్‌నగర్, తాటిపర్తి గ్రామాల రైతులు కలెక్టరేట్‌కు రాగా.. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అక్కడే ప్రధాన గేట్ ఎదుట బైఠాయించి.. నిరసన తెలుపుతూ.. (ఫైల్)

### చేవెళ్ల సెగ్మెంట్‌లో 111జీవోపై..

చేవెళ్ల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో 111 జీవో సమస్య ఎప్పటి నుంచో ఆ ప్రాంత ప్రజలను వెంటాడుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ జీవోను ఎత్తివేసినా ఎన్నికల కోడ్ రావడంతో కొంత ఆలస్యమైనది. ప్రస్తుత ఎమ్మెల్యే యాదయ్య 111 జీవో ఎత్తివేతకు చట్టబద్ధత తీసుకొస్తామని హామీ ఇచ్చి.. ఆ తర్వాత దానిని పట్టించుకోవడంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

### షాద్‌నగర్‌లో చటాన్‌పల్లి రైల్వే వంతెనపై రైతుల నిరసన

షాద్‌నగర్ నియోజకవర్గంలోని షాద్‌నగర్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్లో అతి ముఖ్యమైనది చటాన్‌పల్లి నుంచి షాద్‌నగర్ వరకు వెళ్లే మార్గంలో రైల్వే వంతెన నిర్మాణం.. దీనిని త్వరగా నిర్మించాల న్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నది. బ్రిడ్జి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని.. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే చటాన్‌పల్లి నుంచి షాద్‌నగర్ వరకు వెళ్లే మార్గంలో రైల్వే వంతెనను నిర్మిస్తానని హామీ ఇచ్చి మరిచిపోయారని పలువురు స్థానికులు ఎమ్మెల్యే తీరుపై మండిపడుతున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల, ఆమనగల్లు మండలాల్లోనూ హామీలను అమలు చేయాలంటూ నిరసనలు, ఆందోళనలు పెరుగుతున్నాయి. ఎన్నికలకు ముందు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇర్విన్‌ను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారని.. గెలిచిన తర్వాత ఆ మాటే మరిచిపోయారని..ఇటీవల పలు ప్రారంభోత్సవాలకు వచ్చి న ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ మల్లు రవిలను ఇర్విన్ ప్రజలు అడ్డుకుని తీవ్ర నిరసన తెలిపారు. అలాగే, అందుగుల గ్రామంలోనూ బ్రిడ్జిని నిర్మిస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చి.. తర్వాత విస్మరించారని స్థానికులు ఆందోళనకు దిగారు.

ఇర్విన్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆందోళన చేస్తున్న ప్రజలు





ఇర్విన్‌లో రోడ్డుపై బైఠాయించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజలు

# మగువలూ దూసుకెళ్తున్నారు

- ఏటేటా పెరుగుతున్న మహిళా డ్రైవింగ్ లైసెన్స్‌లు
- గతేడాది 43,774 లైసెన్స్‌లు జారీ



సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : నగరంలో ఏటేటా డ్రైవింగ్ లైసెన్సులు తీసుకుంటున్న మహిళల సంఖ్య పెరుగుతున్నది. అటు స్వయం ఉపాధిలోనూ ఇటు ఉద్యోగాల్లోనూ నగరంలో మహిళల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో అందుకు అనుగుణంగా ద్విచక్ర, కారు లైసెన్సులు పొందుతున్న మగువల శాతం కూడా అదే స్థాయిలో ఉన్నది. కార్యాలయాలకు వెళ్లడం .. పిల్లలను స్కూళ్ల వద్ద దింపడం, పండుగలకు ఊరెళ్లడం వంటి పనులు సమయానుసారంగా చేసుకునేందుకు వీలుగా డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. దీంతో వీరి సంఖ్య కొంతకాలంగా క్రమంగా జోరందుకున్నది. గతేడాది 43,774 మంది మహిళలు లైసెన్స్‌లు పొందగా ఈ ఏడాది జనవరి నెల ముగిసేలోపే 1778 మంది మగువలు లైసెన్స్ పొందారు. .

### కారు లైసెన్సులే ఎక్కువ

నగరంలో సుమారు 400లకు పైగా డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. వీటితోపాటు మరో 50- 60 వరకు మారుతి, టయోటా లాంటి కంపెనీ డ్రైవింగ్ స్కూళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఒక్కో బ్యాచ్‌కు కనీసం 20-35 మంది చొప్పున కారు నడపడం నేర్చుకుంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలో 2019 నుంచి ప్రస్తుతం వరకు సుమారు 2 లక్షలకు పైగా మంది మహిళలు డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. ఇందులో అధిక భాగం కారు లైసెన్స్ ఉన్నవాళ్లే.

**హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇలా...**

| | |
|---|---|
| 2019 | -30555 |
| 2020 | -20851 |
| 2021 | -29,898 |
| 2022 | -31,902 |
| 2023 | -42,557 |
| 2024 | -43,774 |
| 2025 | -1778 (ప్రస్తుతం) |